
ఎమ్మెల్సీ దాసోజు శ్రావణ్‌ను సత్కరిస్తున్న కార్పొరేటర్ వెల్దండ వెంకటేశ్

ప్రజల పక్షాన నిరంతర పోరాటం

● ఎమ్మెల్సీ దాసోజు శ్రావణ్‌కుమార్

బంజారాహిల్స్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ నిరంతరం ప్రజల పక్షాన పోరాటం చేస్తుందని ఎమ్మెల్సీ దాసోజు శ్రావణ్‌కుమార్ అన్నారు. జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలోని ఫిలింనగర్‌లో కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ ఆధ్వర్యంలో శనివారం జరిగిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ నేతలు అమలుసాధ్యం కానీ హామీలిచ్చి అధికారంలోకి వచ్చారని, ప్రజలు కాంగ్రెస్ పార్టీని నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలంతా ప్రజల్లోకి వెళ్లి సమస్యల పరిష్కారానికి పోరాటం చేయాలని సూచించారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎస్పీ నర్సింగ్‌రావు

మాదకద్రవ్యాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

బేగంపేట, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాల పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని యాంటీ నార్కోటిక్స్ డీఎస్పీ నర్సింగ్ రావు సూచించారు. శనివారం సోమాజిగూడలోని రాజ్‌భవన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మాదకద్రవ్యాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తల్లిదండ్రులు కొంత సమయం పిల్లల కోసం కేటాయిస్తూ, నిత్యం వారి దిన చర్యలను గమనించాలన్నారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నివారణపై విద్యార్థులతో పాటు తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని ఆయన కోరారు.

ఇంట్లోకి చొరబడి బంగారం చోరీ

బంజారాహిల్స్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): భవనం రెండవ అంతస్తుకు ఎక్కిన దొంగలు బాల్కనీ వైపు ఉన్న ఇంటి తలుపు తెరిచి చోరీకి పాల్పడ్డారు. ఫిలింనగర్ ఫేజ్-1లో నివసించే సి.రాములు ఇంట్లోకి ఈ నెల 14న గుర్తుతెలియని వ్యక్తులు ప్రవేశించారు. రెండో అంతస్తుకు చేరుకొని బాల్కనీ నుంచి బెడ్ రూమ్‌లో వెళ్లిన నిందితులు బీరువాలో ఉన్న రెండు బంగారు ఉంగరాలు, హెడ్ ఫోన్ చోరీ చేశారు. రూ.2.20 లక్షల విలువ చేసే ఆభరణాలు చోరీకి గురయ్యాయని బాధితులు ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తి అరెస్ట్

బంజారాహిల్స్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): హోలీ సందర్భంగా మద్యం దుకాణాలు మూసివేయాలని ప్రభుత్వం ఆదేశించినప్పటికీ మద్యం అమ్ముతున్న ఓ వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. బంజారాహిల్స్ రోడ్ నంబర్ 2, ఇంద్రానగర్‌లో హోలీ రోజు మద్యం అమ్మకాలు జరుగుతున్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో దాడులు నిర్వహించారు. స్థానికంగా ఉండే కూరగాయల వ్యాపారి కె.వెంకటేష్ మద్యం సీసాలతో దొరికాడు. అతను బంద్‌ను దృష్టిలో పెట్టుకొని స్థానిక ప్రియాంక వైన్స్‌లో మద్యం కొనుగోలు చేసి ఎక్కువ ధరకు అమ్ముతున్నట్టు తేలింది. పోలీసులు మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని నిందితుడితో పాటు వైన్స్ నిర్వాహకులపై కేసు నమోదు చేశారు.

నిరంతరం ప్రజల మధ్యే ఉంటా

● ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్

అమీర్‌పేట, మార్చి 15(ఆంధ్రజ్యోతి): నిరంతరం ప్రజల మధ్యనే ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. వివిధ శాఖల అధికారులు, బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి శనివారం అమీర్‌పేట డివిజన్ బుద్ధనగర్‌లో పర్యటించి స్థానికుల సమస్యలను తెలుసుకున్నారు. మౌలికవసతుల కల్పనపై అధికారులు దృష్టి సారించాలని ఎమ్మెల్యే తలసాని సూచించారు. బుద్ధనగర్‌లో ప్రమాదకరంగా ఉన్న ఇనుప విద్యుత్ స్తంభాలను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బస్తీలో అంతర్గత రోడ్ల నిర్మాణం కోసం వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. కమ్యూనిటీ హాల్‌కు విద్యుత్ సరఫరా లేదని, కిటికీలు దెబ్బ తిన్నాయని స్థానికులు ఆయన దృష్టికి తీసుకురాగా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని శాఖ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీ రజనీ కాంత్, డీఈ వాసుదేవ రెడ్డి, వాటర్ వర్క్స్ జీఎం హరి శంకర్, ఏఎంహెచ్ఓ చంద్రశేఖర్ రెడ్డి, ఏఈలు మౌనిక, సుష్మ, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


అధికారులతో కలిసి బుద్ధనగర్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే తలసాని

గౌడలను శ్రీనివాస్‌గౌడ్ తప్పుదోవ పట్టిస్తున్నారు

● కాంగ్రెస్ గీత కార్మిక విభాగం చైర్మన్ నాగరాజుగౌడ్

ఖైరతాబాద్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): టూరిజం శాఖ పరిధిలో ఉన్న నీరా కేఫ్‌ను తెలంగాణ గీత పారిశ్రామిక సహకార సంస్థకు అప్పగించడంపై హర్షం వక్తం చేస్తూ ప్రభుత్వానికి గౌడ సంఘాల నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. టీపీసీసీ రాష్ట్ర గీత కార్మిక విభాగం చైర్మన్ కేశం నాగరాజుగౌడ్ ఆధ్వర్యంలో పీవీ నరసింహారావు మార్గ్‌లోని నీరా కేఫ్ వద్ద సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్ గౌడ్, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధు యాష్కీ గౌడ్‌ల చిత్రపటాలకు క్షీరాభిషేకంతో పాటు నీరాతో అభిషేకం చేశారు. ఈ సందర్భంగా కేశం నాగరాజు గౌడ్ మాట్లాడుతూ.. మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ గౌడ కులస్తులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఆయన ఐదేళ్లు మంత్రిగా ఉన్నప్పుడు కనిపించని సమస్యలు, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కనిపిస్తున్నాయని మండిపడ్డారు. జనగామ జిల్లాకు సర్వాయి పాపన్న గౌడ్ పేరుతో పాటు, ఆయన విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై పెట్టాలనే ఆలోచన వారు అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు రాలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది మాత్రమే పూర్తయిందని, సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో మ్యానిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చేందుకు కట్టుబడి ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘాల నాయకులు టీ.రేవతి గౌడ్, రమణ గౌడ్, ఆనంద్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, నళిని తదితరులు పాల్గొన్నారు.



నీరాభిషేకం చేస్తున్న గౌడ సంఘాల నేతలు

బీఆర్ఎస్ ప్రభుత్వంలో రైతులకు అన్యాయం

● రైతు సంఘాల సమాఖ్య న్యాయ సలహాదారు శ్రీనివాస్‌రెడ్డి

పంజాగుట్ట, మార్చి 15(ఆంధ్రజ్యోతి): కృష్ణా నది జలాల విషయంలో కేసీఆర్ ప్రభుత్వంతో పాటు కేంద్ర ప్రభుత్వం దక్షిణ తెలంగాణ రైతులకు అన్యాయం చేశాయని రాష్ట్ర రైతు సంఘాల సమాఖ్య న్యాయ సలహాదారు పి.శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు. రైతు సంఘాల సమాఖ్య, కృష్ణా రివర్ పరిరక్షణ జేఏసీల ఆధ్వర్యంలో శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గోదావరి, కృష్ణా నదీ పరివాహక రైతుల మధ్య అసమానతలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ రమేష్ రెడ్డి, సమాఖ్య అధ్యక్షప్రధాన కార్యదర్శులు శ్రీరామ్ రెడ్డి, డి.విజయ్ పాల్ రెడ్డిలతో కలిసి ఆయన మాట్లాడారు. బడ్జెట్‌లో ఎక్కువ నిధులు కేటాయించి ప్రతి రైతుకు రైతు భరోసా, రెండు లక్షల రూపాయల రుణమాఫీ, సన్న వడ్లకు బోనస్ ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. రైతుల పక్షపాతి అని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం మహబూబ్ నగర్, నల్గొండ, రంగారెడ్డి, ఖమ్మం జిల్లాల రైతులకు సాగునీరు అందించాలన్నారు. కృష్ణా నది నీటిలో న్యాయమైన వాటా సాధించుకుని, కృష్ణా పరివాహక ప్రాంత తెలంగాణ రైతాంగాన్ని కాపాడుకుందామని ఆయన పేర్కొన్నారు ఈ సమావేశంలో సమాఖ్య నాయకులు ఎస్.రామస్వామి, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.


సమావేశంలో అభివాదం చేస్తున్న ప్రొ. రమేష్ రెడ్డి, న్యాయవాది శ్రీనివాస్ రెడ్డి, శ్రీరామ్ రెడ్డి తదితరులు


ఆందోళన నిర్వహిస్తున్న బాచుపల్లి వాసులు

వాయు కాలుష్యాన్ని నియంత్రించాలి

బేగంపేట, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): బాచుపల్లిలో పెరిగిపోతున్న వాయు కాలుష్యాన్ని అరికట్టేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని బాచుపల్లి పరిసర ప్రాంతాలకు చెందిన పలు అసోసియేషన్ల ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మాజీ కార్పొరేటర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో సనత్‌నగర్‌లోని రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి కేంద్ర కార్యాలయం వద్ద శనివారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ.. కాలుష్యం వల్ల తమ ప్రాంత వాసులు తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారని, కాలుష్యాన్ని వెదజల్లుతున్న కంపెనీలు నిబంధనలు పాటించడం లేదన్నారు. వాయు కాలుష్యం కారణంగా స్థానికులు మరో ప్రాంతానికి వెళ్లిపోతున్నారని, 2016 నుంచి కాలుష్యంపై పోరాటం చేస్తున్నా ఎలాంటి ప్రయోజనం ఉండటం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. బోల్లారం, కాజిపల్లి, బొంతపల్లి, పాశ మైలారం ప్రాంతాల్లో వాయు కాలుష్యం తీవ్రంగా ఉందన్నారు.

కేంద్ర మంత్రితో కాసేపు..


బేగంపేట రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న ఆధునికీకరణ పనుల పరిశీలనకు వచ్చిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలిసిన బేగంపేట డివిజన్ బీజేపీ నాయకులు కె.విజయ్‌కుమార్, అశోక్‌యాదవ్, శ్రీరాం, మహేష్, నర్సింహ తదితరులు

- బేగంపేట, మార్చి 15 (ఆంధ్రజ్యోతి)

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

ఎర్రగడ్డ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): అర్హులందరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్‌కుమార్ యాదవ్ అన్నారు. రామ నర్సయ్య గౌడ్ అనే వ్యక్తికి ఆయన శనివారం సీఎం సహాయనిధి చెక్కును అందజేశారు. ముఖ్యమంత్రి సహాయనిధి పథకం పేదల ఆరోగ్యానికి భరోసా ఇస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఏ.యాదగిరి యాదవ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం కుటుంబాలకు నిత్యావసర సరుకుల పంపిణీ

అమీర్‌పేట, మార్చి 15(ఆంధ్రజ్యోతి): రంజాన్ ఉపవాస దీక్షలను పురస్కరించుకుని పేద ముస్లిం కుంటుంబాలకు సహకారం అందించడం గొప్ప విషయమని అమీర్‌పేట మాజీ కార్పొరేటర్ శేషుకుమారి అన్నారు. శనివారం బీకేగూడ మసీద్ బస్తీ నివాసితుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు నజీరుద్దీన్ ఖాద్రీ ఆధ్వర్యంలో బోరబండ, సనత్‌నగర్, కుత్బుల్లాపూర్, ఎర్రగడ్డ తదితర ప్రాంతాలకు చెందిన పేద ముస్లీం కుటుంబాలకు శేషుకుమారి నిత్యావసర సరుకులను అందజేశారు. కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, బస్తీ వాసులు పాల్గొన్నారు.



అడ్డగుట్టలో ఆకస్మిక తనిఖీల్లో పాల్గొన్న ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజు తదితరులు

రోడ్డును కబ్జా చేస్తే కఠిన చర్యలు

● ఏసీపీ శంకర్ రాజు హెచ్చరిక

అడ్డగుట్ట, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : అడ్డగుట్ట, తుకారాంగేట్ ప్రాంతాల్లో రోడ్డుకు ఆనుకుని వ్యాపారాలు చేస్తూ ట్రాఫిక్‌కు అంతరాయం కల్గిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజు హెచ్చరించారు. 'రోడ్డు దాటాలంటే భయం.. భయం' అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో ఈనెల 11న ప్రచురించిన కథనానికి ఏసీపీ స్పందించారు. శుక్రవారం రాత్రి 10 గంటలకు ఆయన మారేడుపల్లి ట్రాఫిక్ ఎస్సై శ్రీధర్, తుకారాంగేట్ పోలీసులతో కలిసి అడ్డగుట్ట, తుకారాంగేట్ ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. అడ్డగుట్ట చౌరస్తాలో అడ్డగుట్ట, తుకారాంగేట్ ప్రాంతాల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. అడ్డగుట్ట పెట్రోల్ బంకు వద్ద పెట్రోల్ నింపుకొనేందుకు పెద్ద సంఖ్యలో జేసీబీలు క్యూ కట్టడంతో పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని, అలా జరగకుండా జేసీబీ యజమానులకు అవగాహన కల్పిస్తామన్నారు.



నిరసన తెలుపుతున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు శ్రీకిషన్, అజిత్

ఎస్సీ వర్గీకరణ తర్వాతే ఉద్యోగ నియామకాలు

● ఎంఆర్‌పీఎస్ డిమాండ్

బోయిన్‌పల్లి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని త్వరగా అమలులోకి తీసుకొచ్చి, దాని ప్రకారం ఉద్యోగ నియామకాలు చేపట్టాలని కంటోన్మెంట్ ఎంఆర్‌పీఎస్ నాయకుడు శ్రీకిషన్ మాదిగ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ నియామకాలను ఎస్సీ వర్గీకరణ ప్రకారమే చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఎంఆర్‌పీఎస్ నేతలు శ్రీకిషన్, అజిత్ కల్యాణ్‌ల ఆధ్వర్యంలో శనివారం బోయిన్‌పల్లి మార్కెట్ యార్డులోని అంబేడ్కర్ విగ్రహం ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శ్రీకిషన్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ లేకుండా ఉద్యోగాలు భర్తీ చేస్తే ఎస్సీల ఉద్యోగాలన్నీ మాలలకే వెళ్తాయని అన్నారు. మార్చి 17న ఎస్సీ వర్గీకరణ చట్టం అసెంబ్లీలో ప్రవేశ పెడతామని ప్రకటించిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం అప్పటివరకు ఉద్యోగ పరీక్షల ఫలితాలు నిలిపివేస్తే ఏమౌతుందని ప్రశ్నించారు. కార్యక్రమంలో మంద మధుకర్ మాదిగ, మధు, బాబేందర్, జగదీష్ మాదిగ, రాజు మాదిగ, విష్ణుమాదిగ, శ్రీను, బాలు తదితరులు పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందులు

బౌద్ధనగర్, మార్చి15(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ నియోజకవర్గం మహ్మద్‌గూడలో శనివారం రాత్రి ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్సీ కవిత, స్థానిక ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ, ఇఫ్తార్ విందులు సర్వమత సామరస్యాన్ని చాటుతాయన్నారు. అన్ని మతాల ప్రజల సహజీవనానికి తెలంగాణ ప్రతీక అన్నారు. ఇఫ్తార్ విందుకు హాజరు కావటం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు అబ్దుల్, మునావర్, యువనాయకులు కిషోర్‌గౌడ్, రామేశ్వర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పేదల వైద్యసేవలకు సహకారం

● ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

బౌద్ధనగర్, మార్చి15(ఆంధ్రజ్యోతి): నిరుపేదలు నాణ్యమైన వైద్యసేవలు పొందేందుకు తమవంతు సహకారాన్ని అందిస్తున్నానని సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్ అన్నారు. శనివారం సాయంత్రం సీతాఫల్‌మండిలోని తన కార్యాలయంలో ఆయన పలువురికి వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి వచ్చిన ఆర్థిక సాయం మంజూరు పత్రాలను అందజేశారు. పార్సీగుట్టకు చెందిన పద్మావతికి రూ. 2 లక్షలు, చిలకలగూడకు చెందిన మహ్మద్ ఫిరోజ్‌కు రూ. 2 లక్షలు, వారాసిగూడకు చెందిన భవానీకి రూ. 2 లక్షలు, అడ్డగుట్టకు చెందిన బాబుమియాకు రూ.1.10 లక్షలు విలువ చేసే సీఎం సహాయ నిధి ఎల్‌ఓసీ పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఆలకుంట హరి, జి.చంద్రశేఖర్, గిరి తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయ హుండీ లెక్కింపు

తిరుమలగిరి మార్చి 15 (ఆంధ్రజ్యోతి): బొల్లారం డౌటన్ బజార్ లోని హనుమాన్ ఆలయ హుండీని శనివారం లెక్కించారు. రూ. 63,261ల ఆదాయం వచ్చింది. ఈ ఆదాయాన్ని ఆలయ అభివృద్ధికి వెచ్చిస్తామని ఈఓ మహేందర్ రెడ్డి తెలిపారు. హుండీ లెక్కింపులో ఇన్‌స్పెక్టర్ ఆండాలు, రెవెన్యూ అధికారులు సత్యనారాయణ, విష్ణువర్ధన్, రాములు, అర్చకులు వేణుగోపాల్ శర్మ, నాగేంద్ర ప్రసాద్, కేఎల్.ఎన్ చార్యులు, భక్తులు పాల్గొన్నారు.



మైనంపల్లిని కలిసిన అరవింద్ తదితరులు

మైనంపల్లిని కలిసిన యూత్ కాంగ్రెస్ ఇన్‌చార్జి

తిరుమలగిరి మార్చి 15 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ ఇన్‌చార్జిగా నియమితులైన జి.అరవింద్ శనివారం మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అరవింద్‌కు మైనంపల్లి శాలువా కప్పి సత్కరించారు. రంగారెడ్డి జిల్లాలో యూత్ కాంగ్రెస్‌ను మరింత బలపేతం చేసేందుకు కృషి చేయాలని ఆయన సూచించారు. మైనంపల్లిని కలిసిన వారిలో టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి నరసింహన్ కన్నన్, సీనియర్ నాయకుడు బాల్‌రాజ్, రాజు, సతీష్, గాంధీ ఉన్నారు.

ఎఫ్‌ఓబీ వాడకమేదీ?



సిగ్నల్ వద్ద రోడ్డు దాటేందుకు ఇబ్బంది పడుతున్న పాదచారులు



మెట్టుగూడ రైల్వే ఆఫీసర్స్ క్లబ్ వద్ద పాదచారుల కోసం నిర్మించిన బ్రిడ్జి

- జంక్షన్‌కు దూరంగా ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఏర్పాటు
- అనుకూలంగా లేకపోవడంతో వినియోగించని పాదచారులు
- నిరుపయోగంగా మారిన మెట్టుగూడ ఫుట్ ఓవర్ బ్రిడ్జి
- రోడ్డు దాటేందుకు ఇబ్బంది పడుతున్న చిన్నారులు, మహిళలు, వృద్ధులు

చిలకలగూడ, మార్చి13 (ఆంధ్రజ్యోతి): వందలాది వాహనాలు, పాదచారులతో నిత్యం అత్యంత రద్దీగా ఉండే ప్రాంతం మెట్టుగూడ టీ జంక్షన్. ఇక్కడి నుంచే తార్నాక, మల్కాజగిరి, ఈసీఐఎల్ ప్రాంతాలకు జనం రాకపోకలు సాగిస్తుంటారు. అయితే, అధికారుల అనాలోచిత నిర్ణయం స్థానికులకు శాపంగా మారింది. అవసరమున్న చోట కాకుండా వేరేచోట ఫుట్ ఓవర్ బ్రిడ్జి (ఎఫ్ఓబీ)ని ఏర్పాటు చేయడంతో మెట్టుగూడ వాసులు రోడ్డు దాటడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

- మెట్టుగూడ జంక్షన్ వద్ద బ్రిడ్జి నిర్మాణానికి చేపట్టిన చర్యలు ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి. రైల్వే ఆసుపత్రి, అయ్యప్ప ఆలయం, సెయింట్ ఆంథోని చర్చి తదితర ప్రదేశాలకు రాకపోకలు అధికంగా ఇక్కడి నుంచే సాగిస్తుంటారు. ఈ జంక్షన్ వద్ద యూ టర్ ఏర్పాటు చేసి స్కైలాబ్ హోటల్ వద్ద ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేశారు. ఇక్కడ రోడ్డు దాటేందుకు పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.
- పాదచారులు రోడ్డు దాటడానికి మెట్టుగూడ ఆఫీసర్స్ క్లబ్ వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఏర్పాటు చేశారు. ఇది మెట్టుగూడ జంక్షన్‌కు దూరంగా ఉండటం, ప్రయాణికులకు అనుకూలంగా లేకపోవడంతో దానిని ఎవ్వరూ వినియోగించడం లేదు. దీంతో ఎక్కేవారు.. దిగేవారు లేక ఈ బ్రిడ్జి నిరుపయోగంగా మారింది.
- మెట్రో రైల్ బ్రిడ్జి ఉన్నప్పటికీ అది మెట్రో ప్రయాణికుల కోసం మాత్రమే అనే ఉద్దేశంతో ఎవ్వరూ వినియోగించటం లేదు. సంబంధిత అధికారులు వెంటనే వై జంక్షన్ వద్ద పాదచారుల రాకపోకలకు అనువుగా బ్రిడ్జిని నిర్మించాలని కోరుతున్నారు.
- రైల్వే ఆసుపత్రికి, సరుకులు. ఇతర పనుల కోసం వెళ్లే వారు రోడ్డు దాటాలంటే నానా అవస్థలు పడాల్సి వస్తోంది. ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఏర్పాటు చేసి పది నుంచి ఐదు నిమిషాలకు ఒకసారి 20 సెకన్లు ట్రాఫిక్‌ను నిలిపి పాదచారులు రోడ్డు దాటేందుకు చర్యలు తీసుకున్నా.. ఆ సమయంలో ఎక్కువ మంది రోడ్డు దాటలేక పోతున్నారు.
- తార్నాక నుంచి మెట్టుగూడ వరకు రోడ్డు విశాలంగా ఉండటం, అక్కడ సిగ్నల్స్ లేకపోవటంతో వాహనదారులు విపరీతమైన వేగంతో రాకపోకలు సాగిస్తుండటంతో రోడ్డు దాటడానికి వృద్ధులు, వికలాంగులు, మహిళలు ఇబ్బం ది పడుతున్నారు.
- పాదచారులు, స్థానికుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

అపరిశుభ్ర వాతావరణం



ఉదయం వాకింగ్ చేయటానికి రైల్వే ఆఫీసర్స్ క్లబ్ దారి వెంట వెళ్తుంటాను. నిర్మానుష్యంగా ఉండే ఫుట్ ఓవర్ బ్రిడ్జి వద్ద కొందరు మల, మూత్ర విసర్జన చేస్తుండటంతో అపరిశుభ్రంగా మారింది. అసాంఘిక కార్యకలాపాలను కూడా సాగిస్తున్నారు. ఇక్కడ బ్రిడ్జి ఎందుకు ఏర్పాటు చేశారో తెలియదు. రాకపోకలు లేక నిరుపయోగం మారింది. దీనిని వై జంక్షన్ వద్ద ఏర్పాటు చేస్తే ఉపయోగకరంగా ఉంటుంది.

-నాగేశ్వరరావు, మెట్టుగూడ వాసి

వై జంక్షన్‌లో బ్రిడ్జి నిర్మాణానికి ప్రయత్నిస్తున్నాం



మెట్టుగూడ వై జంక్షన్ వద్ద సమస్య పరిష్కారం కోసం బ్రిడ్జి నిర్మించేందుకు గతంలో ప్రతిపాదనలు సిద్ధం చేశాం. ప్రభుత్వం మారిపోవడంతో ఆ ఫైల్ మూలనపడింది. రైల్వే ఆఫీసర్స్ క్లబ్ వద్ద ఏర్పాటు చేసిన ఫుట్ ఓవర్ బ్రిడ్జిని మార్చాలని, లేదా నూతన బ్రిడ్జిని నిర్మించాలని జీహెచ్ఎంసీ సమావేశాల్లో స్థానిక కార్పొరేటర్, నేను పోరాటం చేస్తూనే ఉన్నాం.

- పద్మారావు గౌడ్, శాసన సభ్యుడు

మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలి

●టీపీసీసీ కార్యదర్శి నరసింహన్ కన్నన్

తిరుమలగిరి మార్చి 15(ఆంధ్రజ్యోతి): మహిళలను కోటీశ్వర్లను చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి నరసింహన్ కన్నన్ అన్నారు. బొల్లారం డౌటన్ బజార్ లోని గంగపుత్ర సంఘం కమ్యూనిటీ హాల్ లో డౌటన్ బజార్ మహిళా సమైక్య ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన మహిళా దినోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. కేక్ కట్ చేసి అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నరసింహన్ కన్నన్ మాట్లాడుతూ, మహిళలు వంటింటికే పరిమితం కాకుండా కుటీర పరిశ్రమలను ఏర్పాటు చేసుకుని ఆర్థికంగా నిలదొక్కుకొని నలుగురికి ఉపాధి కల్పించాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సైతం మహిళా సాధికారతలో భాగంగా కోటీశ్వరులను చేసే దిశగా కృషి చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్, సీనియర్ నాయకుడు బాల్‌రాజ్, సతీష్, గాంధీ, మహిళా నాయకులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న నరసింహన్ కన్నన్ తదితరులు

దూద్‌బావి ప్రభుత్వ పాఠశాలలో..

చిలకలగూడ, (ఆంధ్రజ్యోతి): చిలకలగూడ దూద్‌బావి ప్రభుత్వ పాఠశాలలో మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం మహిళల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లులకు వివిధ రకాల పోటీలు నిర్వహించి బహు మతులు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యా యు డు మల్లికార్జున్ రెడ్డి మాట్లాడుతూ, మహిళలు చదువుకుంటేనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని, మహిళలు విద్యకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అనంతరం మహిళా ఉపా ధ్యాయులు మల్లీశ్వరి, హసీనా బేగం తదితరులను సత్కరించారు.



దూద్‌బావి పాఠశాలలో మహిళా టీచర్లకు సత్కార దృశ్యం

సికింద్రాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి

●కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

చిలకలగూడ, మార్చి15(ఆంధ్రజ్యోతి): మెట్టుగూడ డివిజన్ దూద్‌బావిలో శనివారం కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తన ఎంపీ ఫండ్స్‌తో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, కమ్యూనిటీ హాళ్లు పేదలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని, తక్కువ ఖర్చుతో శుభకార్యాలు నిర్వహించుకోవచ్చని అన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేస్తున్నానని, మరిన్ని మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నానని తెలిపారు. కార్యక్రమంలో మహంకాళి జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి, దిశ కమిటీ సభ్యురాలు శారదా మల్లేష్, మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరి సునీత పాల్గొన్నారు.



కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

ఇంట్లోకి చొరబడి బంగారం చోరీ

బంజారాహిల్స్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): భవనం రెండవ అంతస్తుకు ఎక్కిన దొంగలు బాల్కనీ వైపు ఉన్న ఇంటి తలుపు తెరిచి చోరీకి పాల్పడ్డారు. ఫిలింనగర్ ఫేజ్-1లో నివసించే సి.రాములు ఇంట్లోకి ఈ నెల 14న గుర్తుతెలియని వ్యక్తులు ప్రవేశించారు. రెండో అంతస్తుకు చేరుకొని బాల్కనీ నుంచి బెడ్‌రూమ్‌లో వెళ్లిన నిందితులు బీరువాలో ఉన్న రెండు బంగారు ఉంగరాలు, హెడ్ ఫోన్ చోరీ చేశారు. రూ.2.20 లక్షల విలువ చేసే ఆభరణాలు చోరీకి గురయ్యాయని బాధితులు ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'గ్లకోమా' గుర్తింపు పరీక్షలు చేయించుకోండి

●గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ఇందిర

అడ్డగుట్ట, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): గ్లకోమాను గుర్తించేందుకు వైద్య పరీక్షలు చేయించుకోవాలని గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ఇందిర అన్నారు. 'గ్లకోమా నివారణకు చేతులు కలుపుదాం' అనే నినాదంతో శనివారం గాంధీ మెడికల్ కాలేజీ ఆవరణలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఇందిర మాట్లాడుతూ, గ్లకోమా (నీటి కాసుల వ్యాధి) 40 ఏళ్ల వయస్సు పైబడి, కుటుంబంలో ఎవరికైనా గ్లకోమా వ్యాధి ఉండటంతో పాటు షుగర్, బీపీ కిడ్నీ వంటి వ్యాధి ఉన్న వారికి వస్తుందన్నారు. ఈ వ్యాధిగ్రస్తులు కంటి చూపును నెమ్మదిగా, శాశ్వతంగా కోల్పోతారన్నారు. గ్లకోమాను గుర్తించేందుకు అవసరమైన కంటి వైద్య పరీక్షలు చేయించుకోవాలని, వ్యాధి ఉన్నట్టు నిర్ధారణ అయితే వెంటనే అవసరమైన చికిత్స చేయించుకొని కంటి చూపును కాపాడుకోవాలని అన్నారు. ఈనెల 9న నుంచి 15 వరకు గ్లకోమా వారోత్సవాల్లో భాగంగా గాంధీలో స్క్రీనింగ్ పరీక్షలు గాంధీలో నిర్వహించామన్నారు. కార్యక్రమంలో నేత్ర విభాగాధిపతి ప్రొఫెసర్ రవి శేఖర్, వైద్యులు ప్రావీణ్య, ఐశ్వర్య, జూనియర్ వైద్యులు పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీలో పాల్గొన్న ప్రిన్సిపాల్ ఇందిర తదితరులు

త్వరలో కమ్యూనిటీ హాల్ పనులు ప్రారంభిస్తాం

●అడ్డగుట్ట కార్పొరేటర్

అడ్డగుట్ట, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : అడ్డగుట్టలో కొన్నేళ్ల క్రితం నిలిచిపోయిన కమ్యూనిటీహాల్ నిర్మాణ పనులు వెంటనే ప్రారంభిస్తామని డివిజన్ కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి తెలిపారు. అర్ధంతరం నిలిచిపోయిన కమ్యూనిటీహాల్ పనులను శనివారం ఆమెతో పాటు సికింద్రాబాద్ జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ సుభాష్‌రావు పరిశీలించారు. రూ 1.45 కోట్ల వ్యయంతో త్వరలో నిర్మాణాన్ని పూర్తి చేస్తామని కార్పొరేటర్ తెలిపారు.



కాన్షీరామ్‌కు నివాళి

అడ్డగుట్ట, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : బీఎస్పీ వ్యవస్థాపకుడు కాన్షీరామ్ 91వ జయంతిని శనివారం తుకారాంగేట్‌లోని ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. కాన్షీరామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బీఎస్పీ సికింద్రాబాద్ ఇన్‌చార్జి బక్కూరి నర్సింగ్‌రావు, జోగు ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

రైలుకింద పడి యువకుడి ఆత్మహత్య

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత ఇబ్బందుల నేపథ్యంలో ఓ యువకుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన డబిల్‌పురలో జరిగింది. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ డేవిడ్ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ చేగుంట ప్రాంతానికి చెందిన మహేష్ (23) బేగంపేట ప్రకాశ్‌నగర్ ప్రాంతంలో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. వ్యక్తిగత ఇబ్బందుల కారణంగా శనివారం మేడ్చల్-డబిల్‌పుర రైల్వే స్టేషన్ల మధ్య ఎదురుగా వస్తున్న రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. లోకో పైలెట్ ఇచ్చిన సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న సికింద్రాబాద్ రైల్వే పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రైవేట్ స్కూల్ బస్సు బోల్తా

బోయిన్‌పల్లి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): డ్రైవర్ నిర్లక్ష్యంతో ఓ ప్రైవేట్ స్కూల్ బస్సు బోల్తా కొట్టిన ఘటన బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. బోయిన్‌పల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జీడిమెట్ల విలేజ్ ప్రాంతానికి చెందిన న్యూ లిటిల్ లిల్లీ స్కూల్ బస్సు శనివారం ఉదయం మిలిటరీ డైరీఫారం వైపునకు విద్యార్థులను పాఠశాలకు తీసుకురావడానికి వెళ్తోంది. ఈ క్రమంలో ముందు వెళ్తున్న ఆర్టీసీ బస్సును, లారీని ఓవర్ టేక్ చేయబోయే క్రమంలో వేగంగా వచ్చిన స్కూల్ బస్సు అదుపుతప్పి పక్కనే ఉన్న డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. బస్సులో విద్యార్థులు లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు రహదారిపై పడిన బస్సును క్రేన్ సహాయంతో అక్కడి నుండి తొలగించారు. ఈ ఘటనలో క్లీనర్‌కు గాయాలైనట్లు పోలీసులు తెలిపారు.



అదుపుతప్పి బోల్తాపడ్డ బస్సు

కుమారుడు మందలించాడని తండ్రి అదృశ్యం

బోయిన్‌పల్లి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): కుమారుడు మందలించడంతో మనస్తాపం చెందని తండ్రి ఇంటి నుంచి ఎటో వెళ్లిపోయాడు. బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ ఘటన జరిగింది. ఎస్ఐ శివశంకర్ తెలిపిన వివరాల ప్రకారం... నాయికిని చంద్రప్ప (65) బోయిన్‌పల్లి దుబాయ్ గేట్ వద్ద నివాసం ఉంటున్న తన కుమారుడు వెంకటేష్‌తో కలిసి ఉంటున్నాడు. ఇతనికి ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు. వీరందరికీ వివాహాలయ్యాయి. చంద్రప్ప ప్రస్తుతం తన రెండవ కుమారుడు వెంకటేష్ వద్ద ఉంటున్నాడు. కాగా, ఆర్థిక ఇబ్బందుల కారణంగా తండ్రి అందరినీ డబ్బులు అడుగుతున్నాడు. ఈ విషయం తెలిసి వెంకటేష్ రెండురోజుల క్రితం తండ్రిని మందలించాడు. దీంతో మనస్తాపం చెందిన చంద్రప్ప శుక్రవారం ఇంట్లో ఎవ్వరికీ చెప్పకుండా ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. స్థానికంగా గాలించడంతో పాటు బంధువులను వాకబు చేసినా తండ్రి ఆచూకీ తెలియపోవడంతో వెంకటేష్ శనివారం బోయిన్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



చంద్రప్ప